ఆదాయం పెరిగేనా..

- ట్రేడ్ లైసెన్సులు లేకుండానే వ్యాపారాలు
- మున్సిపాలిటీ ఆదాయానికి గండి
- బాన్సువాడలో 1034 లైసెన్స్ దుకాణాలు
- అనధికారికంగా కొనసాగుతున్న వందలాది వ్యాపారాలు



బాన్సువాడ పట్టణంలోని రోడ్డుపై కొనసాగుతున్న వ్యాపారాలు

బాన్సువాడ : మున్సిపాలిటీలో ఆదాయ వనరులు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న కొందరు వ్యాపారుల కారణంగా ఆదాయానికి గండి పడుతూనే ఉంది. మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన ట్రేడ్ లైసెన్సుల జారీలో కొత్త పంథా అనుసరించాలని సర్కారు మున్సిపల్ అధికారులను ఆదేశించడంతో యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. క్షేత్ర స్థాయిలో ఉన్న దుకాణాలకు, లైసెన్స్‌లు పొందే సంఖ్యకు పొంతన లేదు. దీంతో పాత విధానంలో అనుమతులు జారీ చేస్తోంది. మున్సిపాలిటీల్లోని అన్ని ప్రాంతాల్లో ఉన్న వ్యాపార కేంద్రాల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తూ జియో ట్యాగింగ్ చేసేలా ప్రణాళిక రూపొందించారు.

పట్టణాల్లో వేలాది దుకాణాలు ఉన్నా వందల్లోనే అనుమతులు తీసుకుంటున్నారు. ఒక్కో దుకాణం నుంచి సుమారు రూ.2 వేలకు పైబడి రుసుము చెల్లించాల్సి ఉంటుంది. వివిధ విభాగాలకు అనుగుణంగా రూ.20 వేల వరకు రుసుము స్వీకరిస్తున్నారు. దీంతో మున్సిపాలిటీలు ఆదాయం లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. బాన్సువాడ పట్టణంలో బస్టాండ్, తాడ్కోల్ చౌరస్తా, బాన్సువాడ–బోధన్ ప్రధాన రహదారి వెంట ఉన్న వ్యాపార దుకాణాలు అనుమతులు లేకుండానే కొనసాగుతున్నాయి.

షట్టర్‌లో ఒక దుకాణం ఉంటే దాని ముందు రోడ్డుపై మరో దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని దర్జాగా వ్యాపారం కొనసాగిస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. రోడ్డుపైనే వ్యాపారాలు చేస్తూ వాహనాలను రోడ్డుపై నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. రోడ్డుపై వ్యాపారాలు చేసే వారిని మున్సిపల్ సిబ్బంది పలుమార్లు అనుమతులు తీసుకోవాలని వెళ్తే రాజకీయ నాయకులు రంగ ప్రవేశం చేసి మున్సిపల్ సిబ్బందితోనే వాగ్వాదం చేస్తుండడంతో సిబ్బంది చేసేదేమీ లేక వెనుదిరుగుతున్నారు.

జియో ట్యాగింగ్ చేసేలా..

బాన్సువాడ పట్టణంలో ఎలాంటి అనుమతులు పొందకుండా నెలకు రూ.లక్షల్లో అర్జిస్తున్న వారు కొందరున్నారు. నయాపైసా చెల్లించకుండా మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఏళ్ల నుంచి మున్సిపల్ ఆదాయం సమకూరకున్నా అధికారులు మిన్నకుండి పోతున్నారు. పట్టణంలో అనుమతి పొందిన వ్యాపార దుకాణాలు 1034 ఉంటే అనుమతులు తీసుకోకుండా బల్దియా ఆదాయానికి గండి కొడుతున్న దుకాణాలు వందల్లో ఉన్నాయి. ఇటువంటి సమస్యలను అధిగమించేందుకు తాజాగా సర్కారు ఆదేశాలతో ప్రతి దుకాణం చిత్రాలు సేకరించి జియో ట్యాగింగ్ చేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతి తప్పనిసరి

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వ్యాపార దుకాణాలకు అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. దుకాణాలు, వ్యాపార సముదాయాలకు జియో ట్యాగింగ్ కూడా చేస్తున్నాం. అనుమతులు తీసుకోని వ్యాపార సంస్థలను సీజ్ చేస్తాం. – శ్రీహరిరాజు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుల మధ్య చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు



కామారెడ్డి టౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తన జన్మదిన వేడుకలను శనివారం మున్సిపల్ కార్మికులతో కలిసి జరుపుకున్నారు. శానిటేషన్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేయగా కార్మికులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి కేక్ తినిపించారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్మికుల జేఏసీ నాయకులు చైర్‌పర్సన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సానిటేషన్, వాటర్‌వర్క్స్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చదువుకు ప్రాధాన్యత ఇవ్వండి



ఎల్లారెడ్డి: పాఠశాలలో చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. తన కార్యాలయంలో శనివారం ఆయన జీవదాన్ పాఠశాల సిబ్బందితో సమావేశమయ్యారు. పాఠశాలలో చదువు తప్ప ఇతర కార్యక్రమాలను ప్రోత్సహించొద్దని సూచించారు. సిబ్బంది కలిసి మెలిసి ఉండాలని, విద్యార్థులు సక్రమమైన మార్గంలో నడిచేలా చూడాలన్నారు. పాఠశాలలో మత పరమైన కార్యక్రమాలు చేపట్టొద్దన్నారు. సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేశ్, జీవదాన్ ప్రిన్సిపాల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించాలి



నిజాంసాగర్(జుక్కల్): ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను జుక్కల్ మండలంలో నిర్మించాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును జుక్కల్ మండల యువకులు శనివారం కోరారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కృషి చేసిన ఎమ్మెల్యేను వారు ఘనంగా సన్మానించారు. ఎడ్యుకేషన్ హబ్‌గా జుక్కల్‌నియోజకవర్గం అభ్యున్నతికి ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



భిక్కనూరు: ప్రతి విద్యార్థి చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. బస్వాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సమాచార హక్కు చట్టంతోపాటు విద్యా చట్టంపై శనివారం ఆయన అవగాహన కల్పించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ చట్టాలపై న్యాయవాదులు సతీశ్‌కుమార్, శ్రీనివాస్‌రావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ పరిరక్షణకమిటీ మండల అధ్యక్షుడు బోండ్ల ఆంజనేయులు, కార్యదర్శి నవీన్‌గౌడ్, హెచ్‌ఎం జయదేవ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



ఎల్లారెడ్డి: ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మంథని సామెల్ అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల అమలును రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ తనిఖీ



ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని తహసీల్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని ఆర్డీవో మన్నె ప్రభాకర్ శనివారం తనిఖీ చేశారు. సమయ పాలన పాటించాలని, నిబంధనల ప్రకారం చార్జీలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ మహేందర్‌కుమార్ తదితరులున్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని పోలింగ్ స్టేషన్‌లను ఆర్డీవో పరిశీలించారు.

కొనసాగుతున్న సర్వే డాటా ఎంట్రీ



డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్



బీబీపేటలో..



లింగంపేటలో..

బాన్సువాడ/బీబీపేట/లింగంపేట : సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ కొనసాగుతోంది. బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, లింగంపేట ఎంపీడీవో నరేశ్, భిక్కనూర్ ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి శనివారం ఆన్‌లైన్‌లో వివరాలను నమోదును పరిశీలించారు. తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలని సిబ్బందికి సూచించారు.

అక్రమ వసూళ్లపై విచారణ జరపాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: టీచర్ ఉద్యోగాలు సాధించిన వారి నుంచి ఎంప్లాయీ ఐడీ, పాన్ నంబర్‌ల కోసం డీటీవో, ఎస్‌టీవో కార్యాలయంలో కొనసాగుతున్న అక్రమ వసూళ్లపై తక్షణమే విచారణ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఒక్కో ఉపాధ్యాయుడి నుంచి రూ. 4వేల వరకు బలవంతంగా వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే డీసీఈబీ కార్యదర్శిగా కొనసాగుతున్న వ్యక్తి ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడిగా ఉండొద్దని, ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని కోరారు. జిల్లాలో ఎంఈవోలు యూనియన్‌లకు అనుబంధంగా విధులు నిర్వర్తిస్తున్నారని విచారణ జరిపించాలన్నారు. సమాఖ్య చైర్మన్ యాదయ్య, కో చైర్మన్ రాములు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతాం



కామారెడ్డి టౌన్: ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు చేయనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ రజినీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిగా హాజరై మాట్లాడారు. సుమారు రూ.8,200 కోట్లకు పైగా స్కాలర్‌షిప్, రియింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని దీంతో విద్యార్థులను కళాశాల యాజమాన్యాలు ఫీజులు కట్టాలని ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు బంద్ పాటిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, అజయ్, మణికంఠ, రాహుల్, నితిన్, సాయికృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కామారెడ్డి టౌన్: మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వీఎల్ నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు జీవో 60ని అమలు చేయాలని, కనీస వేతనం రూ.27వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు దశరథ్, బాల్‌రాజు, లక్ష్మణ్, రాజిరెడ్డి, సుదర్శన్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జయంతి



కామారెడ్డి అర్బన్: సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను శనివారం స్థానిక అయ్యప్పనగర్‌లోని సత్యసాయి నిలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీపాలతో నగర సంకీర్తన, కేక్ కటింగ్, సాయి గాయత్రీ హోమం, పాదుకార్చన, పట్టణంలో ఊరేగింపు, నారాయణ సేవ, సాయంత్రం సామూహిక భజన కార్యక్రమంతోపాటు సత్యసాయి హారతి, మహాప్రసాదం కార్యక్రమాలు నిర్వహ/ంచారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని కల్యాణం..



మాచారెడ్డి: కార్తీక శనివారం సందర్భంగా మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీధర్ రావు,జూనియర్ అసిస్టెంట్ సంతోష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం కావడంతో భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో భక్తులు గంగారాం, రాజాగౌడ్, రాంచంద్రం, శివుడు, బాలకిషన్‌రావు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



భిక్కనూరు: మండల కేంద్రంలోని గిద్ద దళితవాడ ప్రాథమిక పాఠశాలతోపాటు బస్వాపూర్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో రాజకిరణ్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల రిజిస్టర్లను పరిశీలించారు. సమయపాలన పాటించాలని సూచించారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు.

నాయకులపై నిందలు మోపడం సరికాదు



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

బిచ్కుంద(జుక్కల్): నియోజకవర్గ సీనియర్ నాయకులపై ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అసత్య ఆరోపణలు చేస్తూ నిందలు మోపడం సరికాదని, ఆయన చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఎంపీటీసీ అవార్ సురేశ్, మొగులయ్య, విమల్ బతాడ్ అన్నారు. మండల కేంద్రంలోని శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ కమల్ కిశోర్ దుకాణదారుల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారని, ఆయన ఎక్కడ డబ్బులు తీసుకున్నారో ఆధారాలతో గాంధీచౌక్‌లో ప్రజల ముందు నిరూపించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా ఎన్నిక కాకముందు రెండేళ్ల కింద నియోజకవర్గానికి వచ్చినప్పుడు లక్ష్మీకాంతరావు ఎవరికీ పరిచయం లేదని, ఆ సమయంలో మాజీ జెడ్పీటీసీ కమల్‌కిశోర్ చేరదీశారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే గంగారాంను ఎదిరించి ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావును దగ్గర తీసుకొని కార్యకర్తలకు, ప్రజలకు పరిచయం చేసి గెలుపునకు కృషి చేసిన విషయం మరిచిపోవద్దని హితవు పలికారు. నాయకులు, కార్యకర్తలను కోతులు, జంతువులతో పోలుస్తూ తిట్టడం పార్టీ కార్యకర్తలను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పోలీసుల ద్వారా భయపెడుతున్నారని, తాము జైలుకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే భండారం బయటపడుతుందన్నారు. సమావేశంలో నాయకులు గంపల గంగాధర్, లతీఫ్ పాషా, పుల్లెన్ వెంకటేశ్, వీరేందర్, జాఫర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

రాజంపేట: మహిళా సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుతారి లక్ష్మి, ఏపీఎం సాయిలు అన్నారు. మండల మహిళా సమాఖ్య భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామ సంఘాల పరిధిలో ఉన్న చిన్న సంఘాలు సక్రమంగా సమావేశాలు నిర్వహించి పుస్తక నిర్వహణ చేసుకోవాలని సూచించారు. సంఘం నుంచి తీసుకునే ప్రతి అప్పును ఆదాయ అభివృద్ధికి వినియోగించుకోవాలని, బకాయిలను రికవరీ చేయాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చిన్న సంఘ సభ్యులకు రెండు లక్షల బ్యాంకు అప్పు నిలువ ఉన్నవారికి లోన్ బీమాతో పాటు సంఘంలో ఉన్న ప్రతి సభ్యురాలికి ప్రమాద బీమా ఉంటుందని తెలిపారు. నూతన సభ్యులను సంఘాలలో చేర్పించడం, పెరటి కోళ్లు, చేపల పెంపకం, గేదెల కొనుగోలు తదితర వాటిని సమావేశంలో వివరించారు. సీసీలు సాయిలు, భాగయ్య, రమేశ్, స్వామి, అకౌంటెంట్ ప్రశాంతి, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుల గణనను అడ్డుకునే వారిపై కేసులు చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

కామారెడ్డి అర్బన్: కులగణను అడ్డుకునే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత కులగణనతో రాష్ట్రంలో బీసీల లెక్క తేలుతుందని, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలకు ఎంతగానో ఉపయోగపడే కులగణను అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బహుజన ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ఎం.వెంకట్, జిల్లా కన్వీనర్ క్యాతం సిద్ధిరాములు, కుర్మసంఘం జిల్లా నాయకుడు జీపీఎం విఠల్, స్వర్ణకార సంఘం రాష్ట్ర కార్యదర్శి చేపూరి వెంకటస్వామి, మొండివారి సంఘం జిల్లా అధ్యక్షుడు ఒట్టెందు శ్రీనివాస్, ఒడ్డెర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాత్రి రాజు, ప్రతినిధులు అబ్దుల్ అజీజ్, జే నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



సత్తెమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ

దోమకొండ: మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిరుమలగౌడ్ తల్లి సత్తెమ్మ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ శనివారం పరామర్శించారు. సత్తెమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యదర్శి అబ్రబోయిన స్వామి, నాయకులు సీతారాం, మధుసూదన్, సంతోష్‌రెడ్డి, నల్లపు శ్రీనివాస్, నాగరపు లింగం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు..



ఏఎంసీ మాజీ చైర్మన్‌ను పరామర్శిస్తున్న గడుగు

మద్నూర్(జుక్కల్): మండలంలోని అవాల్‌గావ్ గ్రామానికి చెందిన మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ నాగ్‌నాథ్ పటేల్ తండ్రి సంగ్రామ్ పటేల్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ పరామర్శించారు. అనంతరం మండల కేంద్రానికి రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడి హోదాలో మొదటిసారి వచ్చిన గడుగును నాయకులు ఘనంగా సన్మానించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



రాజంపేట: మండలంలోని బస్వన్నపల్లి, కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారం, ఎల్లాపూర్ తండా, షేర్ శంకర్ తండాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేసినట్లు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల సీనియర్ ఉపాధ్యక్షుడు భీమరి శ్యామయ్య, శ్రీధర్, బన్సీలాల్, మండల కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, సంతోష్‌రెడ్డి, సహదేవ్, బీరయ్య, దేవీసింగ్, సరిలాల్, ప్రభాకర్, అఖిటి శ్రీనివాస్, బండారి శ్రీనివాస్, ఆయా గ్రామాల అధ్యక్షులు శశికాంత్‌రెడ్డి, సాయిలు, నరేందర్‌గౌడ్, బానోత్ రమేశ్, మండలం యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు బాలరాజు, సభాకర్‌రెడ్డి, విజయ్, సామ్‌సన్, నరేశ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలసిమెలిసి ఉండాలి

ఎల్లారెడ్డిరూరల్: కుటుంబంలో భార్యాభర్తలు కలసిమెలిసి ఉండాలని కుటుంబ స్నేహిత సిబ్బంది అ న్నారు. ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో కుటుంబ స్నేహిత కార్యక్రమంలో భాగంగా శనివారం పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. భార్యాభర్తల గొడవ పిల్లలపై ప్రభావం చూపుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కలిసి ఉండాలని సూచించారు.

సమయపాలన పాటించాలి

మాచారెడ్డి : ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఎంఈవో సురభి దేవేందర్‌రావ్ సూచించారు. ఎల్లంపేట, నడిమితండా ప్రాథమిక పాఠశాలనలు శనివారం ఆయన సందర్శించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే మాక్ టెస్టుకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థులతో ప్రతీరోజూ పాఠ్యాంశం పూర్తయిన వెంటనే హోంవర్క్ చేయించాలని సూచించారు. హెచ్‌ఎంలు నాగరత్నం, సరోజిని ఉపాధ్యాయులు, సీఆర్‌పీ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కార్పొరేట్ విద్య సంస్థలను బహిష్కరించండి



బాన్సువాడ : బాన్సువాడ ప్రాంత ప్రజలు కార్పొరేట్ విద్యా సంస్థలను బహిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ అన్నారు. తల్లిదండ్రులు లక్షలాది రూపాయలు కట్టి తమ పిల్లలను కార్పొరేట్ సంస్థల్లో చదివిస్తే వారి జీవితాలకు భరోసా లేకుండా పోయిందని, చాలా మంది విద్యార్థులు వివిధ కారణాలతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్, శివకవి, కార్తీక్, సాయికుమార్, విఠల్, రాజు, కిరణ్, అశోక్ తదితరులున్నారు.

25న ఛత్రపతి విగ్రహావిష్కరణ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఆర్యక్షత్రీయ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన తాడ్వాయిలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించినున్నట్లు సంఘం అధ్యక్షుడు తానయ్యోల లక్ష్మణ్‌రావు తెలిపారు. కార్యక్రమానికి జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఆర్యక్షత్రీయులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఎంపీని కలిసిన ఏఎంసీ చైర్మన్



నిజాంసాగర్(జుక్కల్): జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఎంపీ సురేశ్ షెట్కార్‌ను పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా ప్రమాణం చేసిన చీకోటి మనోజ్ మొదటిసారి ఎంపీని కలిసి సన్మానించారు. ఆయన వెంట వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు అడ్వొకేట్ రాంరెడ్డి, గుర్రపు శ్రీనివాస్‌పటేల్ తదితరులున్నారు.

ఆర్థిక సహాయం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్‌లో పలు బాధిత కుటుంబాలకు కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ శనివారం ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన కుమ్మరి సిద్ధవ్వ, రామస్వామి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వజ్రమ్మ, రవీందర్‌రెడ్డికి ఆర్థికసాయం అందజేశారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు నారాగౌడ్, సంతోష్, పాండు తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్‌లో పీజీటీ బోటని పోస్టుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గాంధీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎమ్మెస్సీ బోటనీ, బీఈడీ అర్హత ఉన్న వారు ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.